సాక్షి ఏలూరు

శనివారం : 11, మే 2024




నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి న్యూఢిల్లీకి చెందిన పి.నాగ రఘురాం దంపతులు రూ.1,00,000 విరాళంగా అందజేశారు. స్వామిని దర్శించుకున్నారు.



చిన వెంకన్న సేవలో..

ద్వారకాతిరుమల: చిన వెంకన్న క్షేత్రాన్ని ట్రాన్స్‌కో విజిలెన్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ బి.మల్లారెడ్డి సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.



వైఎస్సార్‌సీపీలో చేరికలు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్దీ వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు భారీగా వచ్చి చేరుతున్నారు. VIIIలో ▸

న్యూస్‌రీల్

నేడు కైకలూరులో సీఎం జగన్ సభ



హెలీప్యాడ్ వద్ద పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

కైకలూరు: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శనివారం కైకలూరు తాలూకా సెంటర్‌లో మేమంతా సిద్ధం సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆధ్వర్యంలో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కైకలూరు భాష్యం స్కూల్ సమీప గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ వద్దకు సీఎం జగన్ మధ్యాహ్నం 12.45 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి తాలూకా సెంటర్‌లో బహిరంగ సభకు మధ్యాహ్నం 1.05 గంటలకు చేరి 1.55 గంటల వరకు ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 2.10 గంటలకు హెలికాప్టర్‌లో తిరుగు పయనమవుతారు. హెలీప్యాడ్‌ను జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి శుక్రవారం పరిశీలించారు. పామర్రు–దిగమర్రు జాతీయ రహదారిలో సభ జరగడంతో ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ మళ్లింపుపై చర్చించారు. కైకలూరు పట్టణ సీఐ ఆకుల రఘు మాట్లాడుతూ సీఎం బందోబస్తు నిమిత్తం 600 మంది పోలీసు సిబ్బంది, ముగ్గురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 27 మంది ఎస్సైలు బందోబస్తు నిర్వహిస్తారన్నారు. ముదినేపల్లి, ఆలపాడు గ్రామాల నుంచి వయా కలిదిండి మీదుగా ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్నారు.

పటిష్ట భద్రత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సీఎం జగన్ కైకలూరు పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి తెలిపారు. స్థానిక సీఆర్‌ఆర్ కళాశాల ఆడిటోరియంలో పోలీసు అధికారులు, సిబ్బందికి ఆమె దిశానిర్దేశం చేశారు. కైకలూరులో సభాస్థలి, హెలీప్యాడ్, ముఖ్యమైన ప్రాంతాలను తాను పరిశీలించానన్నారు. డీఎస్పీ ఈ. శ్రీనివాసులు, డీటీసీ డీఎస్పీ కె.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

వివాదాలకు తావులేకుండా ఎన్నికలు



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఈనెల 13న పోలింగ్ రోజున ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా పోలింగ్ ప్రక్రియ స్వేచ్ఛాయుత వాతావరణంలో, ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పక్షాలు సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం పోలింగ్‌కు చివరి 72 గంటల ప్రొటోకాల్, ఎన్నికల సన్నద్ధత, ఎన్నికల ప్రవర్తనా నియమావళి తదితర అంశాలపై రాజకీయ పార్టీ ప్రతినిధులు, అభ్యర్థులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా చిన్నపాటి సమస్యలు తలెత్తితే సంయమనం పాటించాలని, వెంటనే తన దృష్టికి ఫోన్ 9491041487 నంబర్‌లో తెలియజేయాలన్నారు. పోలింగ్‌కి 48 గంటల ముందు అంటే శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఎన్నికల ప్రచారం నిలిపివేయాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల ప్రవేశ మార్గం నుంచి 200 మీటర్ల పరిధిపై మాత్రమే తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బయట నియోజకవర్గాల నుంచి వచ్చిన వ్యక్తులు ఎవరూ ఉండరాదని, పోలింగ్ ఏజెంట్లు ఉదయం 5.30 గంటలకే పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. మాక్ పోల్ నిర్వహించిన అనంతరం బటన్ తప్పనిసరిగా క్లోజ్ చేసేలా పరిశీలించుకోవాలన్నారు. ఆయా నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద ఈనెల 12న ఉదయం 7 గంటలకు రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలన్నారు. అలాగే ఆయా అభ్యర్థులకు అనుమతించిన వాహనాల్లో ఆ నియోజకవర్గానికి సంబంధించిన వ్యక్తులు మాత్రమే ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. వారి పేర్లు ముందుగా తమకు తెలియజేయాలన్నారు. డీఆర్వో డి.పుష్పమణి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకం

భీమవరం: సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు సెక్టోరియల్ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని పశ్చిమ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం భీమవరం విష్ణు కళాశాలలో ఎన్నికల సాధారణ అబ్జర్వర్ ఎం.దీపతో కలిసి సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకమన్నారు. ఈవీఎంల రీప్లేస్‌మెంట్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.

పేదలకు స్వగృహమస్తు



కైకలూరులో జగనన్న కాలనీ ముఖద్వారం

జగన్ సర్కార్ పేదల సొంతింటి కలను సాకారం చేసింది. అర్హత ఉంటే చాలు.. అడిగిందే తడవుగా గృహాలను మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకోసం ఆయా గ్రామాల్లో లేఅవుట్లను చదును చేసి గృహ నిర్మాణాలకు అనువుగా చేసి ఇళ్లు నిర్మిస్తుంది. ఇళ్ల నిర్మాణాల కోసం ఉదారంగా నిధులు ఖర్చుపెడుతోంది. ఇప్పటికే పూర్తయిన ఇళ్లు లబ్ధిదారులకు అప్పగించగా.. మిగిలిన వాటిలోనూ 75 శాతం పూర్తయ్యాయి. త్వరలోనే వాటిని కూడా పూర్తిచేసి పేదలకు అందించేందుకు ప్రయత్నిస్తోంది. అలాగే జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై సైతం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. తాగునీటి సదుపాయం, విద్యుత్, డ్రెయిన్లు ఇలా ప్రతి ఒక్క సదుపాయాన్ని కల్పిస్తుంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తమకు సొంతిల్లు సమకూర్చారని పేదలు సంతోషంగా చెబుతున్నారు.

– ఏలూరు (మెట్రో)



కైకలూరులో జగనన్న కాలనీలో ఇళ్లు

జిల్లాలో ఇళ్ల నిర్మాణం

జిల్లాలో వేసిన లేఅవుట్లు	మంజూరు చేసిన గృహాలు	పూర్తయిన ఇళ్లు	వెచ్చించిన నిధులు	మౌలిక వసతుల కల్పనకు..
778	98,874	32,568	రూ. 701.91 కోట్లు	రూ. 350 కోట్లు



ఏలూరు శనివారపుపేటలోని జగనన్న కాలనీలో ఇళ్లు



సర్వాంగ సుందరంగా జగనన్న ఇల్లు



ఏలూరు శనివారపుపేటలోని జగనన్న కాలనీ

పోలింగ్‌కు సర్వం సిద్ధం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ఏలూరు(మెట్రో): జిల్లాలో 13న జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఏలూరు కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 16.37 లక్షల మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారన్నారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఎన్నికల ప్రచారాలు నిషేధమని, 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచి సోమవారం సాయంత్రం వరకు మద్యం దుకాణాలు మూసివేస్తామని, జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

1,744 పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో 1,744 పోలింగ్ కేంద్రాలు ఉండగా 1,069 స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. 414 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటుచేశామన్నారు. జిల్లాలో 99.4 శాతం ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తయిందని, జిల్లాలో 15,615 పోస్టల్ బ్యాలెట్, 896 మంది హోం ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. పోలింగ్ సిబ్బందికి 12న ఉదయమే ఎన్నికల సామగ్రి అందిస్తామని, అదేరోజు సాయంత్రానికి వారు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత మూడంచెల భద్రత మధ్యలో సీసీ టీవీల పర్యవేక్షణలో ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలిస్తామని చెప్పారు.

రూ.14 కోట్ల సొత్తు సీజ్

జిల్లాలో రూ.14 కోట్ల విలువైన వస్తువులు, నగదును సీజ్ చేశామని, 533 సీ–విజిల్ యాప్ ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. సువిధ ద్వారా 2,500 దరఖాస్తులకు అనుమతులు ఇచ్చామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పక్కాగా మౌలిక వసతులు, 1100 వీల్‌ఛైర్‌లు సమకూర్చామన్నారు. ఎన్నికల సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల సామగ్రిని అందించిన ప్రదేశంలోనే రూట్ల వారీగా బస్సులను ఏర్పాటుచేసి వారిని ఇంటికి చేరుస్తామన్నారు.

పోలింగ్ శాతం పెంచేలా..

ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. గతంలో 84 శాతం పోలింగ్ నమోదైందని, ప్రస్తుతం 88 నుంచి 90 శాతం వరకు పోలింగ్ నమోదవుతుందని అంచనా వేస్తున్నామన్నారు. ఓటర్లు ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. సిబ్బందిని, పోలింగ్ సామగ్రిని పటిష్ట భద్రత మధ్య తరలిస్తామన్నారు.

భయభ్రాంతులకు గురిచేస్తే రౌడీషీట్

ప్రశాంతమైన ఏలూరు జిల్లాలో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి హెచ్చరించారు. అలాగే రౌడీషీట్‌లు కూడా తెరుస్తామన్నారు. జిల్లాలో 3 వేల మందితో భద్రత ఏర్పాటు చేశామని, 1,000 మంది పారామిలటరీ, తమిళనాడు నుంచి ప్రత్యేక పోలీసు సిబ్బందిని రప్పించామన్నారు. డీఆర్వో డి.పుష్పమణి పాల్గొన్నారు.

15,615 పోస్టల్ బ్యాలెట్ల పోల్

జిల్లాలో 15,615 మంది ప్రభుత్వ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నారని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. నియోజకవర్గాల వారీగా ఉంగుటూరులో 1,614 మంది, దెందులూరులో 2,165 మంది, ఏలూరులో 3,123 మంది, పోలవరంలో 2,872 మంది, చింతలపూడిలో 2,267 మంది, నూజివీడులో 1,923 మంది, కైకలూరులో 1,651 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసినట్టు కలెక్టర్ చెప్పారు.

ధాన్యం సొమ్ములు రూ.226 కోట్లు జమ

జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి

ఏలూరు(మెట్రో): జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు 1,89,386.720 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. శుక్రవారం ఆమె ధాన్యం కొనుగోలుపై మాట్లాడారు. జిల్లాలో 2.40 లక్షల టన్నుల కొనుగోలు లక్ష్యంలో భాగంగా ఇప్పటివరకు 1,89,386.720 మెట్రిక్ టన్నులు సేకరించామన్నారు. రైతులకు రూ.396.63 కోట్లకు గాను రూ.226.22 కోట్ల ధాన్యం సొమ్ములను వారి బ్యాంకు ఖాతాలకు జమచేశామన్నారు. అలాగే ముదినేపల్లి, పోలవరం మండలానికి గాను ఖరీఫ్ సీజన్‌లో మిగిలిపోయిన 4,770.840 టన్నుల ధాన్యాన్ని కూడా కొనుగోలు చేశామన్నారు. గోనె సంచులు, వాహనాలు, సాంకేతిక అంశాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. వర్ష సూచనల కారణంగా జిల్లా యంత్రాంగం అప్రమత్తమై ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. రైతులు కూడా తగు జాగ్రత్తలు తీసుకుని ధాన్యాన్ని భద్రపరచుకోవడం ద్వారా నష్టాన్ని నివారించుకోవచ్చన్నారు.

దళిత సేన మద్దతు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రాజ్యసభ ఎంపీ బాబురావు

దెందులూరు: రాష్ట్ర దళిత సేన వైఎస్సార్‌సీపీ విజయానికి మద్దతు ఇవ్వడం, రాష్ట్రవ్యాప్తంగా సభలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు అన్నారు. శుక్రవారం కొవ్వలిలో దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్, కార్యదర్శి బేతాళ ఏసుదాసు, నవీన్ కుమార్, వెంకట్రావు, సువార్తలతో కలిసి ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు.

సిద్ధాపురంలో డీలర్ షిప్ రద్దు

ఉంగుటూరు: నిడమర్రు మండలం సిద్ధాపురంలో చౌకడిపో షాపు–14 ఆదిరెడ్డి రామచంద్రరావుకు చెందిన డీలర్ షిప్‌ను రద్దు చేసినట్టు ఆర్వో ఎస్‌కే ఖాజావలీ శుక్రవారం తెలిపారు. ఆయన టీడీపీ, జనసేనకు అనుకూలంగా ప్రచారం చేయడం, ఆ పార్టీ కార్యకలాపాల్లో పాల్గొన్నట్టు సీ–విజిల్ లో ఫిర్యాదు అందడంతో చర్యలు తీసుకున్నామన్నారు.

జగన్‌తోనే ప్రజలకు ఆర్థిక భరోసా

ఎమ్మెల్యే ఆళ్ల నాని



ఫ్యాన్ గుర్తును చూపిస్తూ ఓటేయమని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ప్రజాసంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెత్తందార్లతో పోటీ పడుతుంటే.. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పేదలకు సంక్షేమాన్ని దూరం చేసేందుకు కుట్రలు, కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని విమర్శించారు. ఏలూరు వన్‌టౌన్ వెన్నవల్లివారి పేటలో వైఎస్సార్ విగ్రహం వద్ద శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే నానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, మధ్యతరగతి వర్గాలు, మహిళలు, రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో సీఎం జగన్ మేనిఫెస్టోలోని ప్రతి హామీని అమలు చేసి చూపించారన్నారు. రాష్ట్ర చరిత్రలోనే సీఎం జగన్ కొత్త అధ్యాయాన్ని లిఖించారనీ, మాట ఇస్తే దానికి కట్టుబడి పనిచేయాలనీ, హామీ ఇస్తే కచ్చితంగా నెరవేర్చాలనే కొత్త ఒరవడికి నాంది పలికారన్నారు. దళారీ వ్యవస్థకు చెక్ పెడుతూ పారదర్శకమైన పాలన అందించారన్నారు. విద్యా, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. నగర మేయర్ నూర్జహాన్, పార్టీ నగర అధ్యక్షుడు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, కార్పొరేటర్లు బొద్దాని అఖిలప్రియ, వీర్లపు డింపుల్ జోబ్, ఇమ్మానియేల్ జయకర్ తదితరులు పాల్గొన్నారు.

మిల్లు పేరుతో టీడీపీ అభ్యర్థి రోషన్ మోసం

- రూ.62 లక్షల బకాయి చెల్లించకుండా తప్పించుకుని తిరుగుతున్నారు
- ఆయన మోసంతో నా భర్త మరణించారు
- చింతలపూడి టీడీపీ అభ్యర్థిపై మహిళా సర్పంచ్ ఆరోపణలు



కోండ్రు వజ్ర కిషోర్, రాఘవాపురం సర్పంచ్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు జిల్లా చింతలపూడి టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్ ఓ మహిళా సర్పంచ్‌ని మోసం చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. మిల్లు కొనుగోలులో రూ.62 లక్షలు బకాయిపడి కొన్ని నెలలుగా తప్పించుకుని తిరుగుతున్నారని మహిళా సర్పంచ్ చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. రోషన్‌కుమార్ దంపతుల చేతుల్లో మోసపోయానని, న్యాయం చేయాలని సీఐడీకి, సీబీఐకి ఫిర్యాదు చేయడం చింతలపూడి రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

దాల్ మిల్ కొనుగోలు పేరుతో..

దాల్ మిల్ కొనుగోలు పేరుతో చింతలపూడి టీడీపీ అభ్యర్థి, ఎన్‌ఆర్‌ఐ సొంగా రోషన్‌కుమార్ దంపతులు తనను మోసం చేశారని మండలంలోని రాఘవాపురం గ్రామ పంచాయతీ మహిళా సర్పంచ్ కోండ్రు వజ్ర కిషోర్ ఆరోపించారు. ఈ మేరకు ఈనెల 7వ తేదీన ఎన్‌ఆర్‌ఐ సొంగా రోషన్ కుమార్ దంపతులపై చట్టప్రకారం చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని సీబీఐ, ఏపీ సీఐడీకి ఫిర్యాదు చేసినట్లు శుక్రవారం తెలిపారు. తన భర్త (ఎన్‌ఆర్‌ఐ) మెకానికల్ ఇంజనీర్ కోండ్రు కిషోర్‌కుమార్‌ని నయవంచన చేసి నూజివీడులో గల తమ దాల్ మిల్‌ను పూర్తి పైకం చెల్లించకుండా రిజిస్ట్రేషన్ చేయించుకొని మోసానికి పాల్పడ్డారని వాపోయారు. తన భర్తను నమ్మించి, ఒక్కరినే తీసుకువెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. తమకు రావాల్సిన రూ.98 లక్షల్లో రూ.36 లక్షలు ఇచ్చి, రూ.62 లక్షలు లోన్ ప్రాసెస్ పూర్తయిన తరువాత ఇస్తామని చెప్పారని వివరించారు. కొన్ని నెలలు తమకు లోన్ రాలేదని, మరికొన్ని నెలలు ఫోన్‌లు ఎత్తకుండా ఎటువంటి సమాధానం చెప్పకుండా, కొంతకాలం తరువాత ఫోన్‌లు ఎత్తినా నాకు, నా భార్యకు ఎటువంటి సంబంధం లేదు.. నా భార్యను వదిలివేశాను.. నీకు రావలసిన డబ్బు ఆవిడను అడుగు అని సొంగా రోషన్‌కుమార్ చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. రోషన్ భార్య విజయను అడిగితే నాకేంటి సంబంధం.. నాకు సంబంధం లేదు.. కొనిచ్చింది ఆయన కాబట్టి ఆయన్నే అడగండి.. మేం విడిపోయాం.. అంటూ ఒకరిపై ఒకరు మోసపూరిత మాటలు చెబుతూ నమ్మిస్తూ కాలం గడిపారన్నారు. దీంతో గత్యంతరం లేక రోషన్ కుమార్, ఆయన భార్య విజయ, తండ్రి రాజారత్నం, మామ సిమియోను, అతని బినామీదారుపై ఫిర్యాదు చేసినట్లు వజ్ర కిషోర్ చెప్పారు. తన ఫిర్యాదులో పక్కా ఆధారాలు చూపిస్తూ ఏ విధంగా రోషన్‌కుమార్ దంపతులు బినామీలను ఉపయోగించి తన భర్తను మోసగించారో వివరంగా పేర్కొన్నారు. రోషన్‌కుమార్ చేసిన మోసాన్ని తట్టుకోలేక తన భర్త కిషోర్ మనోవేదనతో మృతి చెందారని వాపోయారు. అమెరికా నుంచి వచ్చాక డబ్బులు అడుగుతుంటే ఎన్నికల అయ్యాక ఇస్తామని చెప్పారని, తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు పెద్దలు కూడా మధ్యవర్తిత్వం నడిపారని అన్నారు. దళితులని ఉద్ధరించడానికి పైనుంచి దిగి వచ్చానని డాంబికాలు పోతున్న సొంగా రోషన్ కుమార్ ఒక దళిత సర్పంచ్‌కి చేసిన అన్యాయాన్ని గురించి నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇటువంటి వ్యక్తిని ఎమ్మెల్యేగా ఎన్నుకుంటే పరిస్థితి ఎలా ఉంటుందో అని నియోజకవర్గ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

పోలవరంలో ఎగిరేది వైఎస్సార్ సీపీ జెండానే

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



కూటమి నేతలు ఎన్ని కుట్రలు చేసినా ఈ ఎన్నికల్లో పోలవరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని దుద్దుకూరులో క్యాంప్ కార్యాలయం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డిపై జరుగుతున్న కుట్రల మాదిరిగానే పోలవరం నియోజకవర్గంలో కూడా తనపై, తన భార్య ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మిపై కూటమి నేతలు కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని అన్నారు. అసత్య ఆరోపణలు చేస్తూ మానసికంగా కుంగదీసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో ప్రతిసారీ తనను ఎదుర్కోలేక కుట్రలు, కుయుక్తులు పన్నుతూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. 2004 ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి, గిరిజన, గిరిజనేతరుల మధ్య భూసమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. పోలవరంలో వైఎస్సార్ సీపీ గెలుపునకు సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలే తమకు శ్రీరామరక్ష అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌ను అఖండ మెజార్టీతో గెలిపించి సీఎంకు కానుకగా ఇస్తామని ఎమ్మెల్యే చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత

చాట్రాయి : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై స్వామి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమాచారం మేరకు మండలంలోని పర్వతాపురం గ్రామం వైపు వస్తున్న రేషన్ బియ్యం వ్యాన్‌ని పట్టుకున్నట్లు ఆయన చెప్పారు. అందులో ఉన్న సుమారు 3 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వ్యాన్ డ్రైవర్ నక్కా శివపై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

ఓటు హక్కు వినియోగంపై నేడు ముగ్గుల పోటీలు

ఏలూరు (మెట్రో): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగంపై మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు స్వీప్ నోడల్ అధికారి, డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏలూరులోని సెయింట్ థెరీస్సా మహిళా డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ, తృతీయ, బహుమతులుగా రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున నగదును కలెక్టర్ చేతులమీదుగా అందజేస్తామని తెలిపారు.

కొఠారు ప్రచారానికి ఆటంకంపై కేసు నమోదు

పెదవేగి: ముండూరు ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరిపై రాళ్లు, కోడిగుడ్ల దాడి ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. ముండూరులో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అబ్బయ్యచౌదరిపై స్థానిక కాంగ్రెస్, టీడీపీకి చెందిన వారు కోడిగుడ్లు, రాళ్లు విసరడంతో స్థానికంగా స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ ఘటనలో వైఎస్సార్ సీపీ కార్యకర్త స్వల్పంగా గాయపడ్డాడు. అప్పటికే గ్రామంలో భారీగా మోహరించిన పోలీసులు పరిస్థితిని అదుపుచేశారు. ఇదే క్రమంలో గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన నిందితులు ఎ.శ్రీనివాస్, మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ సీపీ వెంటే బీసీలు

- గడిచిన ఐదేళ్లలో బీసీల సంక్షేమానికి రూ.1.85 లక్షల కోట్లు ఖర్చు
- జగన్ ప్రభుత్వంలో దక్కిన గౌరవం, ప్రాధాన్యత, సముచిత స్థానం
- అన్ని పదవుల్లోనూ 50 శాతం బీసీలకు కేటాయింపుపై హర్షం
- పూర్తి స్థాయిలో వైఎస్సార్ సీపీకి మద్దతు పలుకుతున్న బీసీలు



బీసీల సమావేశంలో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నినాదాలు ఇస్తున్న బీసీ సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో గతంలో ఎప్పుడూ లేనంతగా బీసీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత కల్పించడం, నామినేటెడ్ పదవుల్లో కేటాయింపులోనూ పెద్దపీట వేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని బీసీ సంఘాల నేతలు కొనియాడుతున్నారు. స్వాతంత్య్రం వచ్చిన 75 ఏళ్ల తర్వాత బీసీలకు సముచిత స్థానం, గౌరవం, ప్రాధాన్యత కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కితాబిస్తున్నారు. అన్నింటా బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ ఇటు చట్ట సభలోనూ, అటు నామినేటెడ్ పదవుల్లోను అగ్ర తాంబూలం బీసీలకే కల్పించిన గొప్ప నాయకుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఢంకా బనాయించి మరీ చెబుతున్నారు. గడిచిన ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో కేవలం బీసీల సంక్షేమానికే రూ.1.85 లక్షల కోట్లు ఖర్చు చేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీనే అని గుర్తు చేస్తున్నారు. అన్ని పదవుల్లోనూ 50 శాతం బీసీలకు కల్పించి బీసీల పట్ల తనకున్న అంకితభావాన్ని చాటి చెప్పిన మనస్సున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అంటూ బీసీ సంఘాల నాయకులు ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. ఎన్నడూ లేని విధంగా ఇటీవల ఎంపీ సీట్లను బీసీలకు కేటాయించి తన ప్రేమాభిమానాలు చాటుకున్న పార్టీ ఏదైనా ఉంది అంటే అది వైఎస్సార్ సీపీనే అని గుర్తు చేస్తున్నారు. ఏలూరు, నరసారావుపేట ఎంపీ టికెట్లను యాదవులకు, నరసాపురం, రాజమహేంద్రవరం ఎంపీ సీట్లను శెట్టిబలిజలకు కేటాయించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. గత పాలకుల మాదిరిగా కేవలం మాటలతో కాకుండా చేతల్లో చేసి చూపింది సీఎం వైఎస్ జగన్ మాత్రమే అని, అటువంటి వ్యక్తిని మరోసారి సీఎం పీఠంపై కూర్చోపెట్టేందుకు రాష్ట్రంలోని ప్రతి బీసీ నడుబిగించి పనిచేయాలని బీసీ సంఘాల రాష్ట్ర స్థాయి నాయకులు పిలుపునిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు కోసం బీసీలు కృషి చేయాలని కోరుతున్నారు.

50 శాతం సీట్లు బీసీలకే ఇచ్చారు



ప్రస్తుత ఎన్నికల్లో అసెంబ్లీ 175, పార్లమెంటు 25 సీట్లు కలిపి మొత్తం 200 స్థానాలు ఉండగా వాటిలో 100 సీట్లు బీసీలకే కేటాయించి తన ఔన్నత్యాన్ని చాటుకున్నారు సీఎం వైఎస్ జగన్. బీసీలంటేకే వలం బ్యాక్ వర్డ్ క్లాస్ కాదని బ్యాక్ బోన్ క్లాస్ అని చాటి చెప్పిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుంది. బీసీలకు 50 శాతం కేటాయించి బీసీలపై తమ చిత్తశుద్ధిని చాటారు.

– లాకా వెంగళరావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు

యాదవులకు రాజకీయ ప్రాధాన్యం



రాష్ట్రంలో యాదవులకు అత్యధిక రాజకీయ ప్రాధాన్యత కల్పించిన నాయకుడు సీఎం వైఎస్ జగన్. టీటీడీ బోర్డు సభ్యునిగా తనకు అవకాశం కల్పించడం ఎంతో గొప్ప విషయం. స్వాతంత్య్రం వచ్చాక ఏలూరు పార్లమెంటు స్థానంలో మొట్టమొదటిసారిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన కారుమూరి సునీల్ కుమార్‌కు సీటును కేటాయించి బీసీలపై తనకున్న ప్రేమాభిమానాలు చాటుకున్న నేత జగన్ అన్న.

– నెరుసు నాగ సత్యం, టీటీడీ బోర్డు సభ్యులు, ఏలూరు

నాయీబ్రాహ్మణులకు గౌరవం దక్కింది



గత పాలకులు నాయీబ్రాహ్మణులను అవహేళనగా మాట్లాడేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే మాకు గుర్తింపు, గౌరవం లభించింది. నాయీబ్రాహ్మణులను అవహేళనగా మాట్లాడితే చట్టప్రకారం చర్యలు తీసుకునే విధంగా జీవో నంబర్ 50ను తీసుకువచ్చింది. నామినేటెడ్ పదవుల్లోనూ అవకాశం కల్పించింది. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే మాకు గౌరవం, గుర్తింపు లభిస్తుంది.

– గోనుగుంట్ల యలమందరావు, జాతీయ అధ్యక్షులు, నాయీబ్రాహ్మణ సంఘం, విజయవాడ

వైఎస్సార్ సీపీతోనే బీసీల అభివృద్ధి



ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో బీసీలను అక్కున చేర్చుకుని సమ ప్రాధాన్యత కల్పించిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీనే. అటువంటి ప్రభుత్వం మళ్లీ రెండోసారి సీఎంగా వైఎస్ జగన్‌ను తిరిగి గెలిపించేవరకు బీసీలు స్టార్ క్యాంపెయినర్‌లా పనిచేయాలి. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉంటేనే బీసీల అభివృద్ధి సాధ్యం. గత ఐదేళ్లుగా బీసీల పట్ల సీఎం వైఎస్ జగన్ చూపించిన చిత్తశుద్ధే దీనికి నిదర్శనం.

– లక్కోజు రాజగోపాలాచారి, డైరెక్టర్, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్, ఏలూరు

వాహన తనిఖీల్లో నగదు స్వాధీనం



తనిఖీల్లో పట్టుకున్న నగదును చూపుతున్న అధికారులు

కామవరపుకోట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కామవరపుకోట ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఓ వ్యక్తి నుంచి ఎటువంటి ఆధారాలు లేని రూ.2.60 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల చెక్‌పోస్ట్ అధికారి మహమ్మద్ మోహిద్దీన్ చెప్పారు. ఈ నగదు గాలాయగూడెంకు చెందిన వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా ఏలూరు ట్రెజరీలో జమ చేస్తామన్నారు. నగదుకు సంబంధించిన తగిన ఆధారాలను చూపించినట్లయితే నగదును తిరిగి ఇస్తామన్నారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది కె.రమేష్, కె.రామకృష్ణ, సూర్యారావు, షేక్ నాగూర్, ఎం.నాగార్జున, వీడియో గ్రాఫర్లు వీరమల్ల మధు, సాజన్ సాయి పాల్గొన్నారు.

భీమడోలులో..

భీమడోలు : పోలసానిపల్లి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎ.మాధవరావు చెప్పారు. పూళ్ల గ్రామానికి చెందిన పచ్చా రవిసాగర్ తన కారులో ద్వారకాతిరుమల వైపు వెళుతుండగా అధికారుల తనిఖీలో ఎటువంటి ఆధారాలు లేని రూ.లక్ష నగదు తీసుకువెళుతున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును ట్రెజరీలో జమచేస్తామని చెప్పారు. ఏఎస్సై వెంకటేశ్వరరావు, కానిస్టేబుల్ రాజు తనిఖీల్లో పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత



నిందితులు, మద్యంతో ఎస్ఈబీ అధికారులు



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితుడితో ఎస్ఈబీ అధికారులు

చాట్రాయి: తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న భారీ మద్యంను ఎస్ఈబీ అధికారులు పట్టివేశారు. ఎస్ఈబీ డీఎస్పీ జనార్దన్‌నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బూరుగుగూడెం రోడ్డులో ఎస్ఈబీ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా, తెలంగాణ నుంచి వస్తున్న కారు తనిఖీ చేయగా, భారీగా మద్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 600 క్వార్టర్ మద్యం బాటిళ్లను, కారును స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో నూజివీడు రూరల్ ఎస్సై రామకృష్ణ, ఎస్సై స్వామి పాల్గొన్నారు.

బీరు, నగదు స్వాధీనం

కై కలూరు: ఆలపాడు ఎన్నికల చెక్‌పోస్టు వద్ద శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి నాలుగు కేసుల బీరు బాటిల్స్, మరో వ్యక్తి నుంచి రూ.71,540 నగదు సీజ్ చేసినట్లు రూరల్ ఎస్సై టి.రామకృష్ణ చెప్పారు. మద్యం సీసాలపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఐ భీమవరానికి చెందిన కె.శివరామరాజు కారులో వీటిని తరలిస్తుండగా స్టాటిక్ సర్వైలెన్స్ బృంద సభ్యుడు చాంద్ బాషా చేసిన తనిఖీలలో వీరు పట్టుబడ్డారు. హెడ్ కానిస్టేబుల్ నరసింహారావు, కానిస్టేబుల్స్ బి.రమేష్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్ఈబీ దాడులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ అధికారులు జంగారెడ్డిగూడెం, లక్కవరం లలో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో లక్కవరానికి చెందిన దల్లి నీలారెడ్డిని అరెస్టు చేసి 57 మద్యం సీసాలు, జంగారెడ్డిగూడెంకు చెందిన మన్యం దుర్గారావును అరెస్టు చేసి అతని వద్ద నుంచి 110 మద్యం సీసాలు, స్థానిక బైపాస్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి నుంచి 45 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. మూడు ఘటనల్లో ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, ఒక వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. దాడుల్లో ఎసీబీ సీఐ వై.పట్టాభి చౌదరి, ఎస్సైలు సీహెచ్ రాజేష్, బి.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆలపాడు చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన బీరు సీసాలు

మద్యం స్వాధీనం.. ముగ్గురి అరెస్టు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ అధికారులు శుక్రవారం సర్కిల్ పరిధిలో దాడులు నిర్వహించారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ పట్టాభిచౌదరి మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు ఎస్సై సీహెచ్ రాజేష్, సిబ్బందితో కలిసి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి 211 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

వైఎస్సార్ సీపీలోకి వలసలు



తక్కెళ్లపాడులో ఎమ్మెల్సీ జయమంగళ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

మండవల్లి: తక్కెళ్లపాడులో మాజీ సర్పంచ్ వరగంజి అరుణ్‌కుమార్‌తోపాటు గ్రామంలోని టీడీపీ, జనసేనకు చెందిన 100 మంది నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సమక్షంలో వైఎస్సార్ సీపీలో శుక్రవారం చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వరగంజి బేబీకుమారి, బొల్ల కనకారావు, వల్లూరి విక్కీ, బొర్ల వంశీ, పెనమాల దేవదాసు, జల్లి జక్రయ్య, దమవారు మోషే, బద్దే భోగేష్, అబ్బూరి అమర్ పాల్గొన్నారు.

కుక్కునూరులో టీడీపీకి షాక్

కుక్కునూరు: మండలంలో టీడీపీకి షాక్ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నాయకుడు ముప్పాళ్ళ సత్యనారాయణ టీడీపీని వీడి శుక్రవారం ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ జగనన్న నిష్పక్షపాతంగా ప్రజలకు అందిస్తున్న పాలన మెచ్చి పార్టీలో చేరినట్టు చెప్పారు. జగనన్న సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనం సాగించడం తథ్యం అన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహారాజు మాట్లాడుతూ టీడీపీ నాయకులు సొంత క్యాడర్‌ను, పార్టీలు మారకుండా ఆపుకునేందుకు నానా తంటాలు పడుతున్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు అబద్ధపు హామీలను సొంత పార్టీ నేతలే విమర్శిస్తూ గత రెండు రోజులుగా గొమ్ముగూడెం, ఉప్పేర మద్దిగట్ల గ్రామానికి చెందిన 25 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరగా, వింజరం పంచాయతీలో 10 కుటుంబాలు వైస్ ఎంపీపీ తాండ్ర రాజేష్ ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారని అన్నారు. జారిపోతున్న క్యాడర్‌ను చూసి టీడీపీ నాయకులకు నిద్రపట్టడం లేదని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కుచ్చర్లపాటి కృష్ణంరాజు, కోటగిరి నందిని ప్రవర్, రావు వినోద్, తాండ్ర రాజేష్, రాయి సత్యనారాయణ, రంగరాజు చిన్న నరసింహారాజు తదితరులు పాల్గొన్నారు.

వాసుబాబు సమక్షంలో..



ఎమ్మెల్యే వాసుబాబు సమక్షంలో వైసిపి లో చేరిన ఉంగుటూరు వాసులు

ఉంగుటూరు : మండలంలోని కొత్త ఉంగుటూరు గ్రామానికి చెందిన కొంతమంది యువకులు ఉంగుటూరు ఎమ్మెల్యే అభ్యర్థి పుప్పాల వాసుబాబు సమక్షంలో శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అయ్యప్ప, మస్తాన్, నాగరాజు, ఎ.నాయుడు, సాయి, రాంబబు, నాగసాయి, ఏడుకొండలు, వెంకటేశ్వరరావు, మోషేన్, జాన్ ఉన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ రమావతి, నారాయణపురం నాయకుడు అడపా శ్రీను పాల్గొన్నారు.

జోరుగా.. ఉత్సాహంగా

ప్రచార పర్వం

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ప్రచారం తారాస్థాయికి చేరింది. శనివారం ప్రచార పర్వం ముగియనున్న నేపథ్యంలో శుక్రవారం అభ్యర్థులు ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమ పాలనను కొనసాగించేందుకు మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌ను గెలిపించుకోవాలని ఓటర్లను అభ్యర్థించారు.

– సాక్షి, నెట్‌వర్క్



చాట్రాయి : బూరుగుగూడెంలో ప్రచారం చేస్తున్న నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



చింతలపూడి : తిమ్మిరెడ్డిపల్లిలో ప్రచారం చేస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు



టి.నరసాపురం : మర్రిగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థిని తెల్లం రాజ్యలక్ష్మి



కుక్కునూరు : కుక్కునూరు ప్రచారంలో ఓ చంటిబిడ్డను భుజానకెత్తుకున్న ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్



ఉంగుటూరు : యర్రమళ్లలో ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థి పుప్పాల వాసుబాబుకు మద్దతిచ్చిన దళిత మహిళలు

కైకలూరు జగనన్న గ్రీన్ విలేజ్‌లో ఇంటి నిర్మాణాల్లో ఒక భాగం



కైకలూరు..
అభివృద్ధి జోరు

- మారిన కైకలూరు నియోజకవర్గ రూపురేఖలు
- కళ్ల ముందు సాక్షాత్కరిస్తున్న గ్రామాల అభివృద్ధి
- నెరవేరిన పెద్దింట్లమ్మ వారధి నిర్మాణం
- ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా రూ.1,024.20 కోట్ల లబ్ధి
- పరోక్ష నగదు బదిలీ (నాన్ డీబీటీ) ద్వారా రూ.2,113.33 కోట్ల లబ్ధి


మండవల్లి సచివాలయం


వేమవరప్పాడులో రైతు భరోసా కేంద్రం



పెదగొన్నూరులో విలేజ్ క్లినిక్ భవనం

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కైకలూరు రూపురేఖలు మారిపోయాయి. ఏ గ్రామానికి వెళ్లిన సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, నాడు – నేడు పథకంలో రూపుదిద్దిన ప్రభుత్వ పాఠశాలలు.. ఇలా ప్రగతి అంతా కళ్లముందు సాక్షాత్కరిస్తోంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మొత్తం 110 గ్రామ పంచాయతీలు ఉండగా 2,05,604 మంది ఓటర్లు ఉన్నారు. ఇక అభివృద్ధి పనుల విషయానికి వస్తే కొల్లేరు ప్రజల దశాబ్దాల కల కొల్లేరు పెద్దింట్లమ్మ వారధిని రూ.14.47 కోట్లతో పూర్తిచేశారు. కైకలూరులో 100 ఎకరాల్లో డాక్టర్ వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్ ఏర్పాటు, సామాజిక కేంద్రం(సీహెచ్‌సీ)లో 5 పడకల డయాలసిస్ కేంద్రం ఏర్పాటు, ప్రతి సచివాలయంలోనూ రూ.20 లక్షల నిధులతో రోడ్లు, డ్రెయిన్లు, మైక్రో వాటర్ ఫిల్టర్ల నిర్మాణం, కైకలూరులో అగ్రి ల్యాబ్ నిర్మాణం, రూ.8 కోట్లతో డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ నిర్మాణం, దశాబ్దాలుగా వివాదస్పదమైన 96.6 ఎకరాల వైవాక దళిత భూములను 340 మందికి పట్టాల పంపిణీ, విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు, చావలిపాడు, మండవల్లిలో నూతన పశుసంవర్ధక శాఖ కార్యాలయం నిర్మాణం, సమీప జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా కొల్లేటికోటలో అతిపెద్ద అనివేటి మండపం నిర్మాణం, వివిధ దేవాలయాల పునఃప్రతిష్ఠలు, కైకలూరులో సుందరంగా రుద్రభూమి నిర్మాణం, కరోనా విపత్కర సమయంలో దాతల సాయంతో ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు, దాతల సాయంతో కలిదిండి పోలీస్ స్టేషన్, కైకలూరు తహసీల్దారు కార్యాలయం, సంతమార్కెట్‌లో షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం, నాడు – నేడు ద్వారా పాఠశాలలు, ఆస్పత్రుల నిర్మాణాలు. ఇలా అనేక సంక్షేమ కార్యక్రమాలు వైఎస్సార్‌సీపీ పాలనలో నియోజకవర్గంలో జరిగాయి.


కైకలూరు మండలం సర్కారు కాల్వపై నిర్మించిన పెద్దింట్లమ్మ వారధి


కైకలూరులో జగనన్న గ్రీన్ విలేజ్‌లో ఆర్చి నిర్మాణం


కైకలూరు సీహెచ్‌సీలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు

చింతలపూడి మహిళామార్ట్‌లో నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తున్న మహిళలు



మహిళా మార్ట్.. లాభాలు స్మార్ట్

- డ్వాక్రా సంఘాల మహిళలే యజమానులు
- ఎందరికో స్ఫూర్తినిస్తున్న మహిళా మార్ట్‌లు
- స్వయం సమృద్ధి సాధిస్తున్న అతివలు
- నెరవేరుతున్న సీఎం జగన్ ఆశయం

చింతలపూడి: ఆ మహిళల వ్యాపార దక్షతను చూసి ప్రతి ఒక్కరూ ఆశ్చర్యానికి లోనవుతున్నారు. మహిళలు సంఘటితమై పొదుపు సొమ్ముతో ప్రారంభించిన మహిళా మార్ట్‌లు ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. మెట్ట ప్రాంతంలో డ్వాక్రా సంఘాల మహిళలే యజమానులుగా ఏర్పాటైన చేయూత మహిళా మార్ట్‌లు లాభాలదిశగా దూసుకుపోతున్నాయి. పేద, మధ్య తరగతి మహిళలు సంఘటితమై ఆర్థికంగా విజయం సాధించారు. దీంతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం నెరవేరినట్లయ్యింది. జగన్ సీఎం అయ్యాక ప్రతి పథకంలోనూ మహిళలను భాగస్వామ్యం చేస్తూ మహిళల స్వయం సమృద్ధి కోసం కృషి చేస్తున్నారు. ముఖ్యంగా పొదుపు సంఘాల మహిళలను వ్యాపార రంగంలోకి ఆహ్వానించి వివిధ వ్యాపారాల్లో భాగస్వామ్యం చేసి ప్రోత్సహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో పూర్తిగా మహిళల భాగస్వామ్యంతో మహిళా మార్ట్‌లకు శ్రీకారం చుట్టారు.

మెట్ట ప్రాంతంలో పైలెట్ ప్రాజెక్టులు

ఏలూరు జిల్లాలో జంగారెడ్డిగూడెం, చింతలపూడి పట్టణాల్లో పైలెట్ ప్రాజెక్టులుగా ప్రభుత్వం చేయూత మహిళా మార్ట్‌లను ప్రారంభించింది. పూర్తిగా మహిళల సొంత పెట్టుబడితో ప్రారంభించిన రెండు మహిళా మార్టుల్లో చింతలపూడి వ్యాపారపరంగా, లాభాల పరంగా రోజురోజుకూ మంచి ఆదరణ చూరగొంటోంది. 2022 అక్టోబర్‌లో జంగారెడ్డిగూడెంలో 15,898 మంది మహిళా సంఘాల సభ్యులు కలిసి రూ.40,01,800 మూలధనం పెట్టుబడితో, 2023 ఫిబ్రవరిలో చింతలపూడిలో 24,948 మంది మహిళా సంఘాల సభ్యులు కలిసి రూ.45,13,164 పెట్టుబడితో మహిళా మార్ట్‌లను ప్రారంభించారు. ఈ మార్టుల్లో నాణ్యమైన నిత్యవసర సరుకులు తక్కువ ధరకు అందించేలా ప్రముఖ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. చింతలపూడి మార్ట్‌లో రోజుకు సగటున రూ.80 వేల విక్రయాలు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. మార్ట్ ప్రారంభం నుంచి వరకు సుమారు రూ.2 కోట్లకు పైగా అమ్మకాలు జరిగాయి. ఇప్పటివరకు సుమారు రూ.12 లక్షలకు పైగా లాభాలు వచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా జంగారెడ్డిగూడెం మార్ట్‌లో ప్రతి రోజూ రూ.70 వేల విక్రయాలు సాగుతున్నాయి. ఇప్పటివరకు రూ.2 కోట్ల వ్యాపారం జరగ్గా, రూ.10 లక్షల లాభాలు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.


చింతలపూడి ఐకేపీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్


చింతలపూడి మహిళా మార్ట్‌లో కౌంటర్ వద్ద మహిళల రద్దీ

ధైర్యం వచ్చింది



మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేయడంతో ధైర్యం పెరిగింది. ఎవరి మీద ఆధారపడకుండా ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి మార్ట్ ఉపయోగపడుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా మహిళా మార్ట్‌లను ప్రోత్సహించడం అభినందనీయం.

కె. అనూష, మహిళామార్ట్ సిబ్బంది, చింతలపూడి

తక్కువ ధరకే అందిస్తున్నాం



మా మార్ట్‌కు వచ్చే మహిళలకు తక్కువ ధరకు నాణ్యమైన సరుకులు అందిస్తున్నాం. డ్వాక్రా మహిళా సంఘాల వారే కాకుండా బయటినుంచి కూడా కొనుగోలుదారులు వచ్చేలా ప్రోత్సహిస్తున్నాం. మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేసి మహిళలు ఆర్థికంగా ఎదగడానికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

తొమ్మండ్రు లక్ష్మి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, చింతలపూడి

గిరిజనులకు పట్టాభిషేకం

అడవిబిడ్డలకు అండగా..

- 3,710 మందికి 69,814 ఎకరాలకు పట్టాలు
- దశాబ్దాల కల సాకారం చేసిన సీఎం జగన్
- కొనసాగుతున్న సర్వే
- అటవీ హక్కుల చట్టం ద్వారా మేలు


ఐటీడీఏలో పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్యే బాలరాజు (ఫైల్)

బుట్టాయగూడెం: ఏజెన్సీలోని మారుమూల కొండ ప్రాంతాల్లో రాళ్లు, రప్పలు, గుట్టలు బాగు చేసుకొని పోడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు గిరిజనులు. దశాబ్దాలుగా వారు వ్యవసాయం చేస్తున్నా ఆ భూములకు హక్కులు ఉండేవి కాదు. భూమిపై హక్కుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా గత పాలకులు పట్టించుకోలేదు. కష్టపడి పోడు చేసుకున్న భూములకు పట్టాలు పొందలేకపోయారు. ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టపోతే ఎటువంటి పరిహారం కూడా అందేది కాదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీరి కలలను సాకారం చేశారు. గిరిజనుల సర్వతోముఖాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి వారు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇచ్చారు.

1,453 మందికి రైతు భరోసా సాయం

అటవీ హక్కుల చట్టంలో పోడు భూములు పట్టాలు పొందిన గిరిజన రైతులకు సీఎం జగన్ మరో మేలు చేశారు. రైతు భరోసా పథకంలో వ్యవసాయానికి పెట్టుబడి సాయం అందేలా కృషి చేశారు. దీనిలో సుమారు 1,453 మందికి రైతు భరోసా పథకంలో సుమారు రూ.29.06 లక్షలు వారి ఖాతాల్లో జమ చేశారు. అలాగే పోడు భూములకు బ్యాంకుల్లో రుణ సదుపాయం పొందేలా ఏర్పాటుచేశారు.

వైఎస్సార్ పాలనలో 30 వేల ఎకరాలకు..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో పోడు భూములు సాగు చేస్తున్న గిరిజన రైతులకు జిల్లాలో సుమారు 30 వేల ఎకరాలకు పైగా పట్టాలు పంపిణీ చేశారు. అటవీ హక్కుల చట్టంలో అర్హులైన వారందరినీ గుర్తించి పోడు పట్టాలు తొలిగా అందించిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుంది. వైఎస్సార్ తర్వాత ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోడు భూములకు పట్టాలు పంపిణీ చేశారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ..

కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు గిరిజన మండలాలుగా ఉన్నాయి. వీటిలో కోయ, కొండరెడ్డి తెగలకు చెందిన గిరిజనులు ఉన్నారు. కొండరెడ్డి గిరిజనులు కొండ ప్రాంతాల్లో ఆవాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఆయా మండలాల్లో గిరిపుత్రులు దశాబ్దాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్నా వాటికి పట్టాలు లేక పలు ఇబ్బందులు పడ్డారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నల్లజర్ల మండలంలో ఏర్పాటుచేసిన గిరిజనలు ప్రత్యేక సమావేశంలో పోడు భూములకు పట్టాలిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో 3,710 మంది పోడు భూముల రైతులకు సుమారు 69,814.72 ఎకరాలకు అటవీ హక్కుల చట్టం కింద పట్టాలు మంజూరు చేశారు. వీటిని నాటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతుల మీదుగా రైతుకు పంపిణీ చేశారు. వీటిలో 2,736 మందికి 5,358.49 ఎకరాల్లో వ్యక్తిగత పట్టాలు, 456 మందికి 658.6 ఎకరాలు డీకేటీ పట్టాలు, 518 మందికి 63,797.66 ఎకరాలకు సంబంధించి సామాజిక పట్టాలను అందజేశారు.


బుట్టాయగూడెం మండలం కొండ ప్రాంతంలో పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులు

సీఎం జగన్ గిరిజన పక్షపాతి



గిరిజనులకు పోడు భూముల కష్టాలను తీర్చిన ఘనత వైఎస్సార్ కుటుంబానికే దక్కుతుంది. వైఎస్సార్ హయాంలో జిల్లాలో 30 వేల ఎకరాలకు పైగా పట్టాలు పంపిణీ చేశారు. ఆయన తర్వాత మళ్లీ సీఎం జగన్ ఐటీడీఏ పరిధిలోని గిరిజన మండలాల్లో సుమారు 69,814.72 ఎకరాలకు పట్టాలు పంపిణీ చేశారు. సీఎం జగన్ గిరిజనుల పక్షపాతి.

–తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే, పోలవరం

పట్టాలు ఇచ్చిన దేవుడు



నాకు 3.70 ఎకరాల పోడు భూమి ఉంది. సుమారు 30 ఏళ్లుగా ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. పట్టాలు లేకపోవడం వల్ల అవస్థలు పడ్డాను. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగాను. దివంగత సీఎం వైఎస్సార్ చలవతో అటవీ హక్కుల చట్టంలో నా భూమికి పట్టా ఇచ్చారు. ఆయనను మేం దేవుడిగా కొలుచుకుంటున్నాం.

–ఎం.రవిభాస్కర్, లక్ష్మీపురం, బుట్టాయగూడెం మండలం

సిరులు పండిస్తున్నాం



అటవీ భూములకు పట్టాల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూశాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు అటవీ భూములకు పట్టాలిచ్చారు. దీంతో పోడు భూముల పట్టాల కష్టాలు తీరాయి. అలాగే రైతు భరోసా కూడా మొత్తం పథకం వర్తించేలా చేశారు. వారి మేలు మరువలేం. ఆ భూముల్లో సిరులు పండించుకుంటున్నాం.

– వడిశెల సామర్ల, లక్ష్మీపురం, బుట్టాయగూడెం మండలం

నా భూమికి హక్కు



అటవీ ప్రాంతంలో రాళ్లు, రప్పలు తొలగించుకుని కొండపోడు చేసుకుంటున్న మా భూములకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హక్కు కల్పించారు. పోడు పట్టాలిచ్చి రైతులుగా గుర్తించారు. గతంలో పోడు భూములకు పట్టాలు లేక చాలా ఇబ్బంది పడేవాళ్లం. మా కలను సీఎం జగన్ సాకారం చేశారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– వడిశెల రాంబాబు, లక్ష్మీపురం, బుట్టాయగూడెం మండలం

పోలింగ్ సిబ్బందికి విందు భోజనం

గణపవరం: పోలింగ్ విధులకు వెళ్లాలంటేనే ఉద్యోగులు బెంబేలెత్తుతారు. ఎలాగైనా పోలింగ్ విధులు కేన్సిల్ చేయించుకోవడానికి చేయని ప్రయత్నాలంటూ ఉండవు. దీనికి కారణం ఊరుకాని ఊరికి ఎన్నికల విధులకు వెళ్లే సిబ్బంది కష్టాలు అన్నీ ఇన్నీ కాదు. సమయానికి సరైన భోజనం ఉండదు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి, మనశ్శాంతిగా కునుకు తీయడానికి ఏమాత్రం అవకాశంలేక ఉక్కబోత, దోమల మోతతో రేయంతా జాగారం చేసి తెల్లారగానే పోలింగ్ విధులు నిర్వహించడం పరిపాటి. ఇక సిబ్బందికి సరైన భోజనంకాని, టిఫిన్స్‌కాని గగనమే. బిస్కెట్ ప్యాకెట్లు, టీతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. దీనితో ఎన్నికల విధులంటేనే ఉద్యోగులు హడలిపోయే పరిస్థితి. అయితే ఈసారి సార్వత్రిక ఎన్నికలలో పోలింగ్ సిబ్బంది కష్టాలు చాలావరకూ తీరనున్నాయి. నాడు – నేడు పథకంలో చాలా గ్రామాల్లోని పాఠశాలలు సకల సదుపాయాలతో ఇంటికి మించిన వసతులతో అలరారుతున్నాయి. నూతన తరగతి గదులు.. సరికొత్త బెంచీలు, గదికి రెండు, మూడు ఫ్యాన్‌లు, ఆధునాతన టాయిలెట్స్, నిరంతరం నీటి సరఫరా, తాగడానికి మినరల్ వాటర్ ప్లాంట్లు ఉండటంతో సిబ్బందికి వసతి సమస్యలో ఇబ్బందులు తప్పినట్లే.

సరికొత్త మెనూ

పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి ఎన్నికల కమిషన్ భోజన సదుపాయాలను కూడా ఏర్పాటు చేసింది. పోలింగ్ ముందురోజున కేంద్రానికి చేరినప్పటి నుంచి, పోలింగ్ రోజున సాయంత్రం పోలింగ్ ముగిసే వరకూ ప్రత్యేక మెనూ ఏర్పాటు చేశారు. 12వ తేదీ సాయంత్రం పోలింగ్ సిబ్బంది తమకు



కేటాయించిన పోలింగ్ కేంద్రానికి చేరుకోగానే వారికి బొండాలు, గారెలు అల్పాహారం, మజ్జిగ లేదా టీ ఇవ్వాలి. రాత్రి 7.30 గంటలకు చపాతి లేదా రోటీ, అన్నం, ఆకుకూర పప్పు, పచ్చడి, ఆలూటమాట కూర, రసం, పెరుగు, వడియాలు, అరటిపండుతో భోజనం ఉండాలి. పోలింగ్ రోజు 13వ తేదీ ఉదయం 4.30 గంటలకు టీ, 5 గంటలకు వేడి ఇడ్లీ, గారె, రెండురకాల చెట్నీలతో అందించాలి. 9 గంటలకు ఫ్రూట్స్, మజ్జిగ లేదా కొబ్బరినీరు, 11 గంటలకు కేకు, టీ, మధ్యాహ్నం 12.30 గంటలకు విజిటబుల్ బిర్యాని, పెరుగన్నం, నిమ్మకాయ పచ్చడి, 3 గంటలకు ఉస్మానియా బిస్కెట్లు, టీ లేదా ఫ్రూట్‌సలాడ్, సాయంత్రం 6 గంటలకు బొండా, గారి, చెట్నీ, టీ, మజ్జిగ ఇస్తారు. ఇవన్నీ స్థానికంగా తయారు చేయించి, వేడివేడి ఆహారపదార్థాలను ఫ్రెష్‌గా వడ్డించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఒక్కో పోలింగ్ కేంద్రానికి 15 మంది సిబ్బంది చొప్పున మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందించాలని ఆదేశించారు.

ఓటర్లకు వెల్‌కమ్



ఏలూరులో పోలింగ్ కేంద్రాలను సుందరంగా తీర్చిదిద్ది ఓటర్లకు స్వాగతం పలుకుతున్నారు. పోలింగ్ కేంద్రానికి వెళ్లే మార్గంలో ఓటు విలువను తెలియజేసేలా ఫ్లెక్సీలు, పూలకుండీలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రం లోపలి గోడలను సైతం పూలతోనూ, పచ్చని ఇండోర్ ప్లాంట్స్‌తోనూ అలంకరించారు. ఆహ్లాదకర వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

– ఏలూరు టౌన్